క్లుప్తంగా

నేడు పలు గ్రామాలకు విద్యుత్ కోత

యడ్లపాడు: విద్యుత్ మరమ్మతుల కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ట్రాన్స్‌కో డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. మండలంలోని కొండవీడు, స్పైసె స్పార్కు సబ్‌స్టేషన్‌లలో మరమ్మతులు ఉన్నందున పుట్టకోట, కోట, సొలస, లింగారావుపాలెం, చెంఘీజ్‌ఖాన్‌పేట, వంకాయలపాడు గ్రామాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.

మద్యం దుకాణానికి అనుమతి ఇవ్వొద్దు

ఆరేపల్లి గ్రామ పంచాయతీలో తీర్మానం

నరసరావుపేట: రొంపిచర్ల మండలంలోని ఆరేపల్లి గ్రామ సమీపంలో ఏర్పాటు చేయనున్న మద్యం దుకాణానికి అనుమతి ఇవ్వొద్దని ఎంపీటీసీ సభ్యుడు మోతుకూరి వెంకటేష్, గ్రామస్తులు బత్తుల భాను, ఎస్.రామస్వామి, బి.నాగమల్లు, డి.శ్రీనివాసరావు, జడ్డా శ్రీకృష్ణ, బి.ప్రసాదరావు కోరారు. ఈ మేరకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజు సూపరింటెండెంట్‌ను కోరుతూ గ్రామ పంచాయతీలో ఈనెల 26న తీర్మానం చేసినట్లు వారు ఆదివారం తెలిపారు. దుకాణం ఏర్పాటు చేయనున్న ప్రదేశానికి సమీపంలోనే శ్రీ అంకమ్మ దేవాలయం, శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం, కొద్దిదూరంలోనే ముప్పాళ్ల గ్రామ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయాలు ఉన్నాయని తెలిపారు. భక్తులు ఆ దుకాణం ఏర్పాటు చేస్తున్న దారి మీదే వెళ్లాల్సి ఉందన్నారు. అంతేగాకుండా మద్యం దుకాణం వల్ల పలు వివాదాలు, ఘర్షణలు జరిగే అవకాశం ఉందని తెలిపారు.

పోలీసులపై నమ్మకం పెంచాలి



వినుకొండ(నూజెండ్ల): పోలీసులపై నమ్మకం పెంచాలని సిబ్బందికి నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు తెలిపారు. వినుకొండ టౌన్ పోలీసుస్టేషన్‌ను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించిన అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. మీతో–మేము అనే కార్యక్రమంలో భాగంగా ప్రజలకు పోలీసు శాఖపై నమ్మకం పెంచేలా కృషి చేయాలని చెప్పారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించి క్రైమ్ రేటును తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీసుస్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించి సత్వర న్యాయం చేయాలని అన్నారు. అనంతరం పోలీసుస్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వినుకొండ టౌన్ సీఐ శోభన్‌బాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి

చిలకలూరిపేట టౌన్: అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం పట్టణంలో వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని ఆరిపుల్లా నగర్‌లో నివాసం ఉండే పాగ సాయిబు సయ్యద్ సాధిక్(19) శనివారం రాత్రి 8.30 గంటలకు ఇంటినుంచి బయటకు వెళ్లాడు. ఆదివారం ఉదయం పోలిరెడ్డిపాలెం బైపాస్ జంక్షన్ సమీపంలోని రామ్‌శ్రీ అపార్ట్‌మెంట్ ఎదురు రోడ్డు పక్కన శవమై పడి ఉన్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి అమ్మమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

శావల్యాపురం: పిట్టగోడపై కూర్చొని సెల్‌ఫోను మాట్లాడుతుండగా ప్రమాదవశాత్తు జారి పడిన వ్యక్తి చికిత్స పొందుతూ వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. మండలంలోని కొత్తలూరు గ్రామానికి చెందిన వడ్లమూడి సుబ్బారావు ఈనెల 25న మధ్యాహ్నం 3 గంటల సమయంలో పిట్టగోడపై కూర్చొని సెల్‌ఫోను మాట్లాడుతున్నాడు. వర్షం పడి తడిగా ఉండటం వల్ల జారి పడి సీసీ రోడ్డుపై పడ్డాడు. తల వెనుక భాగాన బలమైన గాయాలు కాగా కుటుంబ సభ్యులు వినుకొండ పట్టణంలో ప్రైవేటు వైద్యశాలలో ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యసేవలు కోసం గుంటూరు శ్రీబాలాజీ వైద్యశాలకు తరలించారు. ఈ క్రమంలో వడ్లమూడి సుబ్బారావు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ లోకేశ్వరరావు తెలిపారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

అదుపు తప్పి లారీ బోల్తా



పిడుగురాళ్ల: పాత ఇనుము లోడు లారీ అదుపు తప్పి పడిపోయిన ఘటన మండలంలోని తుమ్మలచెరువు చెట్టు సమీపంలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పిడుగురాళ్ల వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న పాత ఇనుము లోడు లారీ రాత్రి సమయంలో అదుపు తప్పి బోల్తా పడింది. ఇనుప సామగ్రి రోడ్డుపై పడింది. ఈ ప్రమాదంలో అదృష్టవశాత్తు ప్రాణనష్టం జరగలేదు. పట్టణ పోలీసులు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా జాగ్రత్త చర్యలు తీసుకున్నారు.

బొల్లాను విమర్శించే స్థాయి మక్కెనకు లేదు

పల్నాడు వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి ఎం.ఎన్.ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్

వినుకొండ(నూజెండ్ల): మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును విమర్శించే స్థాయి మక్కెన మల్లికార్జునరావుకు లేదని పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి ప్రముఖ న్యాయవాది ఎం.ఎన్.ప్రసాద్ అన్నారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుపై మక్కెన మల్లికార్జునరావు చేసిన విమర్శలను తీవ్రంగా ఖండించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చలవతో 2004లో ఎమ్మెల్యేగా గెలిచిన మక్కెన 2009లో టికెట్ కూడా దక్కించుకోలేకపోయారని తెలిపారు. 2014లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన ఆయనకు కేవలం 5779 ఓట్లు మాత్రమే వచ్చాయని, తమ నాయకుడి బొల్లా 2024లో ఓడిపోయినప్పటికీ లక్ష ఓట్లకు పైగా వచ్చాయని గుర్తు చేశారు. ఆరు నెలల కిందట వైఎస్సార్ సీపీలో ఉన్న మక్కెన , బొల్లా బ్రహ్మనాయుడును అన్ని రకాలుగా పొగిడారన్నారు. అనంతర కాలంలో టీడీపీలో చేరి తమ నాయకుడిని విమర్శించడాన్ని తప్పుపట్టారు. వినుకొండ అభివృద్ధిలో ఎక్కడ చూసినా మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మార్కు కనపడుతుందని గుర్తు చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం వల్ల ఎక్కువగా లాభపడింది టీడీపీ వారేనని తెలిపారు. 2009లో టీడీపీకి చెందిన నాయకులే టార్గెట్‌గా మక్కెన చేసిన ఆగడాలు గుర్తున్నాయని, ఇప్పుడు టీడీపీలో చేరి వారితోనే కలిసి పనిచేస్తుండటం రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు. గతంలో ఎప్పుడులేని విధంగా 2024లో టీడీపీ అధికారంలోకి రాగానే రషీద్ హత్య జరిగిందని, అలాగే అనేకమంది వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై, నాయకులపై అక్రమ కేసులు బనాయించారని అన్నారు. ఆయన హయాంలో వెన్నపూస కాలనీలో హత్య జరిగిందని, అది కూడా రియల్ ఎస్టేట్ గొడవలు కాదా? అని ప్రశ్నించారు. ఎక్కడైనా రాజకీయాల్లో ప్రత్యర్థులు మాత్రమే ఉంటారని, అలాంటిది టీడీపీ గెలిచిన తర్వాత ప్రతిపక్షం వాళ్లని శత్రువులుగా చూడటం ప్రారంభమైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిణామాలు మంచివి కావని తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద జరిగిన గొడవలకు టీడీపీ వ్యక్తులు కారణమని గుర్తుచేశారు. వినుకొండ అభివృద్ధి పథంలో నడిపించేందుకు గతంలో బొల్లా బ్రహ్మనాయుడు చేసిన కృషిని మక్కెన గుర్తు పెట్టుకోకపోయినా ప్రజలల్లో గుర్తింపు ఉందన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు ఎప్పుడు అండగా ఉంటామని గుర్తు చేశారు. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ అమ్మిరెడ్డి అంజిరెడ్డి మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెంచమని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చి నేడు భారం మోపడం దారుణమని ఖండించారు. బెల్టు షాపులు, అక్రమంగా రేషన్ బియ్యం అమ్మేవాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతున్నప్పటికీ స్థానికంగా మాత్రం ఎక్కడా అమలు కావడం లేదని తెలిపారు. యథేచ్ఛగా , వేలం పాటలు పెట్టుకొని మద్యం,రేషన్ అమ్ముకుంటున్నారని, ప్రజలకు మంచి పాలన అందించేందుకు కృషి చేయాలని తెలిపారు. ఇలాంటి చౌకబారు రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బేతం గాబ్రియేలు, వినుకొండ మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు దండు చెన్నయ్య పాల్గొన్నారు.

సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న బీసీ నాయకులు

నరసరావుపేట: బహుజన సామాజిక ఉద్యమకారుల విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాలను రాజకీయ కోణంలో చూడొద్దని బీసీ సంక్షేమ సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం పల్నాడు రోడ్డులోని మహాత్మా జ్యోతీ రావు పూలే విగ్రహం వద్ద సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు యామా మురళి మాట్లాడుతూ ఏలూరు జిల్లా నూజివీడులో ఈ నెల 15న వేలాదిమంది బీసీ వర్గీయుల ఆధ్వర్యంలో దిగ్విజయంగా నిర్వహించిన డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని సోషల్ మీడియాలో దుష్టశక్తులు వివాదం చేశాయన్నారు. దీనికి ప్రక్షాళనగా తాము క్షీరాభిషేకం నిర్వహించామని తెలిపారు. స్వాతంత్య్ర సమర యోధుడు, తాడిత, పీడిత వర్గాలకు మార్గదర్శకులు అయిన లచ్చన్న విగ్రహం కార్యక్రమాన్ని ఇలా అవమానం పరచడం అంటే బీసీల ఆత్మ గౌరవం దెబ్బతీయడమే అన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నాల శ్రీను, పట్టణ అధ్యక్షులు కొల్లిపర బాలాజీ, బీసీ నాయకులు విశ్వేశ్వరావు, యారగని నరసింహారావు, కేశని సుబ్బయ్య పాల్గొన్నారు.

గోపాలమిత్రల నూతన కమిటీ ఏకగ్రీవం



నూతన కార్యవర్గ సభ్యులతో సీఐటీయూ ప్రతినిధులు

నరసరావుపేట రూరల్: పల్నాడు జిల్లా గోపాల మిత్ర సంఘ నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా సిరిగిరి పిచ్చిరెడ్డి, బి.కాశీరావు ఎన్నికయ్యారు. ఆదివారం కోటప్పకొండలోని ఉడుముల గ్రాండ్ కోటప్పకొండలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.హనుమంతరెడ్డి అధ్యక్షతన గోపాల మిత్ర సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రాష్ట్ర కమిటీ సభ్యులు పచ్చవ శ్రీనివాసరావు, ప్రభాకరరావుల సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా ఎస్.ఆంజనేయనాయక్, ఉపాధ్యక్షులుగా జడ్డా లక్ష్మీనారాయణ, సహాయ కార్యదర్శిగా వరప్రసాద్, కోశాధికారిగా జి.శేషగిరిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గోపాలమిత్రల సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు.

బాలోత్సవం పోటీల్లో వేల్పూరు విద్యార్థుల ప్రతిభ



విజేతలకు బహుమతి అందజేస్తున్న బాలోత్సవ కమిటీ సభ్యులు

శావల్యాపురం: పల్నాడు జిల్లా బాలోత్సవం పోటీల్లో మండలంలోని వేల్పూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు వివేకానంద పూర్వ విద్యార్థుల కమిటీ చైర్మన్ సంద్రపాటి చలపతిరావు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏడు బహుమతులు సాధించగా, క్విజ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. మ్యాప్ పాయింటిగ్లో రెండో బహుమతి, లఘు నాటికలో మూడో బహుమతి, వ్యాస రచనల్లో నాల్గవ స్థానం, కోలాటం, జానపద, నృత్యాలు తదితర పోటీల్లో బహుమతులు సాధించినట్లు తెలిపారు. బహుమతులు సాధించిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు షేక్ మహమ్మద్ సుభాని, విద్యా కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు, గైడు టీచర్స్ జె.శ్రీనివాసరావు, మరియదాస్ అభినందించారు.

ప్రమాదం జరిగితే గానీ స్పందించరా?



ప్రమాదం జరిగిన ప్రాంతంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు



ప్రమాదంలో ధ్వంసమైన కారు(ఫైల్)

పిడుగురాళ్ల: ప్రమాదాలు జరిగితే తప్పా సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేని పరిస్థితి అధికారుల్లో నెలకొంది. ఇటీవలే మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ సమీపంలో అద్దంకి నార్కెట్‌పల్లి హైవేపై గీతిక సీబీఎస్‌సీ స్కూల్ సమీపంలో మూల మలుపు వద్ద కారు ప్రమాదం ఘటనలో నలుగురు మృతి చెందారు. ఈ నెల 8న తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. ఈ ప్రాంతంలోని మూల మలుపులో అతివేగంగా వస్తున్న వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. ముందస్తు హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో వాహనదారులు అప్రమత్తం కాలేకపోతున్నారు. రేడియం స్టిక్కర్లతో ప్రమాదం జరుగు మూల మలుపుల్లో ఏర్పాటు చేస్తే..రాత్రిళ్లు వాహనాల లైట్ల వెలుగుకు వాహనాలు నడిపే వారికి హెచ్చరిక బోర్డులు స్పష్టంగా కనిపిస్తాయి. అటువంటి సమయంలో వాహనదారులు వేగం తగ్గించుకొని నిదానంగా వెళ్లే అవకాశాలు ఉంటాయి. తద్వారా ప్రమాదాలు జరగకుండా అండే అవకాశం ఉంటుంది. ప్రమాదం జరిగిన వారం రోజుల తర్వాత ఈ ప్రాంతంలో ముందు మూల మలుపు ఉంది, నెమ్మదిగా పోవాలని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. దీంతో అటుగా వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు ప్రమాదాలు జరిగితే తప్పా హెచ్చరికబోర్డులను ఏర్పాటు చేయలేని పరిస్థితుల్లో అధికార యంత్రాంగం ఉందని ప్రజలు విమర్శిస్తున్నారు.

సాఫ్ట్‌వేర్‌పై విద్యార్థులకు దిశా నిర్దేశం

మాచర్ల రూరల్: మండలంలోని అలుగురాజుపల్లిలోని న్యూటన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సాఫ్ట్‌వేర్ రంగం వైపు మొగ్గు చూపే విద్యార్థులకు హైదరాబాద్ ఇన్ఫినిటీ మెగా టెక్నాలజీస్ సీఈఓలు సుభాష్, రుక్సానా, ఎస్‌వీఆర్ వికాస్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీటెక్, డిగ్రీ తరువాత సాఫ్ట్‌వేర్ రంగంలోకి ఏ విధంగా రావాలి..ఏ ఏ కోర్సులు భవిష్యత్తులో తీసుకుంటే మంచి ఉపాధి అవకాశాలు కలుగుతాయో వివరించారు. మూడు నెలల ఇంటర్న్‌షిప్ చేయించి ప్లేస్‌మెంట్ ఇప్పిస్తామని తెలిపారు. సాఫ్ట్‌వేర్ రంగంలో ఆసక్తి ఉన్న వారిని మోసం చేసేందుకు పలువురు ప్రయత్నిస్తున్నారని వాటి పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వివరాలకు 73824 27742, 85200 99255 సంప్రదించాలని తెలిపారు.మేనేజింగ్ డైరెక్టర్ కీర్తి ప్రియాంక, కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి, శివ నాయక్, ప్రిన్సిపాళ్ళు, ఏఓలు పాల్గొన్నారు.

శ్రీరామా పబ్లిక్ స్కూలు విద్యార్థుల ప్రతిభ



శావల్యాపురం: స్థానిక శ్రీరామా పబ్లిక్ స్కూలు విద్యార్థులు జిల్లా స్థాయి బాలోత్సవం పోటీల్లో మంచి ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపాల్ జి.రత్న కుమారి ఆదివారం తెలిపారు. పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై జరిగిన పోస్టర్ ప్రజంటేషన్ పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించినట్లు తెలిపారు. ఏడో తరగతి విద్యార్థి వి.కార్తీక్, ఆరో తరగతి విద్యార్థి యశ్విన్ అత్యుత్తమ ప్రతిభ కనపరిచినట్లు తెలిపారు. విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ కనగాల వెంకట మోహన్‌చంద్, డైరెక్టర్ అజిత్‌చంద్, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

డ్రైనేజీ నిర్మాణం ఆలస్యంతో అవస్థలు



వినుకొండ(నూజెండ్ల): మండల కేంద్రమైన నూజెండ్ల బీసీ, ఎస్సీ కాలనీలకు అనుసంధానంగా డ్రైనేజీ నిర్మాణం ఆలస్యం కావటంతో రాకపోకలకు నివాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండు నెలల క్రితం డ్రైనేజీ నిర్మాణం కోసం కాలువను తవ్వించారు.అయితే కాంక్రీట్ పనులు ఆలస్యం కావటంతో కాలనీవాసులు రాకపోకలకు అగచాట్లు పడుతున్నారు. రాత్రి సమయంలో కొత్త వ్యక్తులయితే దగ్గరకు వచ్చే వరకు కనిపించకపోవటంతో ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు పూర్తి చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

వాసవీ సేవా సమితి కోశాధికారిగా మునేశ్వరరావు

పిడుగురాళ్ల: పల్నాడు జిల్లా వాసవీ సేవా సమితిల సమైఖ్య కోశాధికారిగా పిడుగురాళ్ల పట్టణానికి చెందిన గజవల్లి వెంకట నాగ మునేశ్వరరావును ఏకగ్రీవంగా ఆదివారం ఎన్నుకున్నారు. జిల్లా వాసవీ సేవా సమితిల సమైఖ్య అధ్యక్షుడు గర్నె పుల్లారావు నియామకపు పత్రాన్ని పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో అందజేశారు. పలువురు ఆర్యవైశ్యులు, సమితిల సమాఖ్య సభ్యులు హాజరై ప్రసంగించారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వాసవీ సేవా సమితి సభ్యులు, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంఈఓ కాంతారావు మృతి



కె.కాంతారావు

మాచర్ల రూరల్: మండల విద్యాశాఖాధికారి -1 కూరగంటి కాంతారావు (58) ఆదివారం గుండెపోటుతో మృతిచెందారు. ఆయన విజయపురి సౌత్ ప్రభుత్వ హైస్కూల్‌లో హెచ్‌ఎంగా పనిచేస్తూ ఎంఈఓ ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించారు. వెల్దుర్తి, మాచర్ల, దాచేపల్లి, గురజాల మండలాలకు ఇన్‌చార్జిగా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలున్నారు. క్రిస్మస్ పండుగ నిమిత్తం ప్రకాశం జిల్లా, అద్దంకిలో ఉంటున్న పెద్ద కుమార్తె వద్దకు వెళ్లారు. అక్కడ ఛాతిలో మంట రావడంతో కుటుంబ సభ్యులు వైద్య శాలకు తీసుకెళ్లి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వారు తెలిపారు. ఎంఈఓ మృతి పట్ల మాచర్ల ఎంఈఓ 2 అల్లి సురేష్, ఎస్టీయూ, యూటీఎఫ్, ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ నాయకులు జూపల్లి గంగాధర్‌బాబు, షేక్ సిలార్ అహ్మద్, నాసర్‌రెడ్డి, షేక్ నసీర్, నాగరాజు, కేశవరెడ్డి, కృష్ణారావు, కొర్లయ్య, కృష్ణానాయక్, రవికుమార్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

డాక్టర్ కృష్ణకాంత్, డాక్టర్ జ్ఞానేశ్వరికి పురస్కారాలు



డాక్టర్ కృష్ణకాంత్, డాక్టర్ జ్ఞానేశ్వరికి అవార్డులు అందజేస్తున్న సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్‌వీ రమణ

నరసరావుపేట: స్థానిక శ్రీ దత్త సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ గార్లపాటి కృష్ణకాంత్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ గార్లపాటి జ్ఞానేశ్వరిలకు ఐకాన్స్ ఆఫ్ హెల్త్‌కేర్ పురస్కారాలు లభించాయి. కొన్నేళ్లుగా వైద్య రంగంలో విశేష ప్రతిభ కనబరుస్తున్నందుకు వారికి ఈ పురస్కారాలు లభించాయి. శనివారం విజయవాడలో టైమ్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్‌వీ. రమణ ముఖ్య అతిథిగా పాల్గొని వారికి ఈ అవార్డులను అందజేశారు. స్థానిక ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, గోల్డ్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కపిలవాయి విజయకుమార్ హర్షం వ్యక్తం చేశారు.

విద్యా రంగంలో ఉపాధ్యాయులది కీలకపాత్ర



పురస్కారాలు అందుకున్న ఉపాధ్యాయులు

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

వినుకొండ(నూజెండ్ల): విద్యారంగంలో ఉపాధ్యాయులది కీలకపాత్ర అని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. కేవీఆర్ అండ్ జయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ గుంటూరు, యూటీఎఫ్ వినుకొండ ప్రాంతీయ శాఖల ఆధ్వర్యంలో స్థానిక జాషువా కళా ప్రాంగణంలో యూటీఎఫ్ జిల్లా కోశాధికారి ఎం. రవిబాబు అధ్యక్షతన 33 మంది ఉపాధ్యాయులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రతిభా పురస్కారాలను ట్రస్ట్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అందజేశారు. అనంతరం లక్ష్మణరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ప్రత్యామ్నాయం లేదన్నారు. ముందు ఎన్ని ఆన్‌లైన్ పనులున్నా పేద పిల్లలకు విద్యను అందించడమే ప్రథమ కర్తవ్యంగా భావించాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఆర్. అజయ్‌కుమార్, పీఏ జిలానీ, డి.వి. లింగయ్య, ఎ.నాగేశ్వరరావు, జి. నాగేంద్రుడు, ఎంఈవోలు సయ్యద్ జఫ్రుల్లా, ఎం. సాంబశివరావు, కె.పార్వతి తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు జయప్రదం చేయండి



కార్యాలయం నుంచి సన్నాహక ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

నరసరావుపేట: కాకినాడలో వచ్చే నెల ఐదో తేదీ నుంచి ఎనిమిది వరకు నిర్వహించే యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ప్రేమ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం స్థానిక అరండల్‌పేటలోని జిల్లా కార్యాలయం వద్దనున్న పతాకాన్ని సీనియర్ నాయకులు ఎన్.స్లీవరాజు ఆవిష్కరించిన అనంతరం మహాసభల జయప్రదం కోసం సన్నాహక ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో రెండోసారి యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలకు ముఖ్యమంత్రి హాజరవుతున్నారని గుర్తుచేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల పక్షాన వారి హక్కులకోసం ఎన్నో పోరాటాలు చేసిందని, ప్రస్తుతం అనుభవిస్తున్న రాయితీలు హక్కులు యూటీఎఫ్ పోరాట ఫలితమేనని తెలిపారు. పల్నాడు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరెడ్డి, ఎం.మోహనరావు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా రంగాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడుకోవడమే ప్రధాన అజెండాగా స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ఫెడరేషన్ కీలకపాత్ర పోషిస్తోందని తెలిపారు. పాలకవర్గాల నిర్బంధాలు, కేసులు, అవరోధాలను అధిగమించి ఉపాధ్యాయులను పోరుబాట పట్టించి సమస్యల పరిష్కారంలో అగ్రగామిగా నిలిచిందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను రక్షించుకోవడం, రాజ్యాంగం లక్ష్యాలు, విలువలు కాపాడుకోవడం ఉపాధ్యాయుల ప్రధానకర్తవ్యంగా ఉండాలని తెలిపారు.. విద్యారంగం ప్రైవేటీకరణ కాకుండా ప్రతిఘటించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని అన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు వాల్యానాయక్, ఏ.భాగేశ్వరీదేవి, జిల్లా కార్యదర్శులు టి.వెంకటేశ్వర్లు, కె.ఉషా శౌరిరాణి, జి.ఆంజనేయులు, ప్రాంతీయ శాఖల బాధ్యులు పాల్గొన్నారు.

నందికుంట విఘ్నేశ్వరాలయంలో చోరీ



విఘ్నేశ్వరాలయం

నాదెండ్ల: గణపవరం–నాదెండ్ల డొంక రోడ్డులోని శ్రీ నందికుంట విఘ్నేశ్వరస్వామి ఆలయంలో చోరీ సంఘటన కలకలం రేపింది. దేవదాయ శాఖ ఇన్‌చార్జి ఈవో జక్కా శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు.. శనివారం రాత్రి పూజారి ఆలయ తలుపులు మూసి వెళ్లాడు. ఉదయం రాగా, తలుపులతో పాటు ఆలయంలో హుండీ పగలగొట్టి ఉన్నాయి. అందులోని నగదు, దేవాలయంలోని సీసీ కెమేరాల రికార్డర్, మైకు, యాంప్లిఫయర్‌లను దొంగలు దోచుకెళ్లారు. పోలీసులకు సమాచారం అందించగా ఎస్ఐ జి. పుల్లారావు సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. మూడు నెలల నుంచి హుండీ లెక్కించలేదు. అందులోని నగదు, ఎలక్ట్రానిక్ వస్తువుల విలువ రూ.1 లక్షకు పైగా ఉంటుందని భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్కాన్ సెంటర్లు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

సత్తెనపల్లి ఆర్డీఓ రమణకాంత్ రెడ్డి



మాట్లాడుతున్న ఆర్డీఓ రమణకాంత్‌రెడ్డి

సత్తెనపల్లి: స్కాన్ సెంటర్ల నిర్వాహకులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని సత్తెనపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి జీవీ రమణ కాంత్ రెడ్డి అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో ఆదివారం పీసీ, పీఎన్‌డీటీ సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ కమిటీ, అడ్వైజరీ కమిటీ సమావేశంజరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్కాన్ సెంటర్లు చట్ట ప్రకారం నియమాలను పాటించాలన్నారు. వాటిని అతిక్రమిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు. ప్రధానంగా స్కానింగ్ కేంద్రాల్లో బ్యానర్లు సక్రమంగా ప్రదర్శించాలని, సరైన రికార్డులు, ఇతర నియమాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. లింగ నిర్ధారణ నేరమని, చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. కమిటీ కన్వీనర్, సత్తెనపల్లి డివిజన్ ఇన్‌చార్జ్ డాక్టర్ ధర్మసింగ్ శాస్త్రి మాట్లాడుతూ స్కానింగ్ కేంద్రాల తనిఖీల్లో గమనించిన విషయాల గురించి, తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సమావేశంలో ఆయా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.